ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబర్ 2023 5 అనంతపురం



నేడు నగరంలో 2కెరన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యత తెలియజేసే విధంగా మంగళవారం నాడు నగరంలో 2కె రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. యువత ఓటరుగా నమోదు చేసుకోవడానికి చురుగ్గా పాల్గొనడాన్ని ప్రోత్సహించడం, ఓటు హక్కును వినియోగంపై ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం లక్ష్యంగా 2కెరన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 8 గంటలకు అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఎస్ఎస్బిఎన్ డిగ్రీ కళాశాల వరకు 2కెరన్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్దఎత్తున విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సాయుధ దళాల పతాక స్టిక్కర్లు, కార్ గ్లాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సాయుధదళాల సంక్షేమానికి చేయూతనిద్దాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశ రక్షణకు నిరంతర సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో త్రిసాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా రూ.70 వేల విలువగల సాయుధ దళాల పతాక స్టిక్కర్లు, కార్ గ్లాగ్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశరక్షణలో త్రిసాయుధ దళాల సేవలు కీలకమన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ 7వ తేదీన దేశవ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేక నిధికి విరివిగా విరాళాలు అందించాలన్నారు. సాయుధ దళాల కుటుంబాలను ఆదుకునేందుకు అధికారులు సిబ్బంది విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జె.శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ గిరీష్, జూనియర్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్, ఒఎస్ అనిల్ పాల్గొన్నారు.

వేగవంతంగా అర్జీలకు పరిష్కారం

డిఆర్ఒ గాయత్రిదేవి



అర్జీదారుని సమస్యను అడిగి తెలుసుకుంటున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు స్పందనలో అందించే అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలని డిఆర్ఒ గాయిత్రిదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మితో కలిసి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 325 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలకు ఎలాంటి పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరిస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. అర్జీలను పరిష్కరించడంపై ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు నిత్యం మానిటర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డీపీవో ప్రభాకర్ రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సామాజిక సాధికార యాత్ర' : ప్రభుత్వ విప్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో మంగళవారం వైసిపి నిర్వహించతలపెట్టిన సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, శ్రేయస్సుకు సిఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. క్యాబినెట్‌లో మంత్రి పదవులు, వివిధ కార్పొరేషన్లలో ఛైర్మన్, పాలకు మండలి పదవులు ఇచ్చారన్నారు. టిడిపి బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని, చంద్రబాబు పాలనలో ఒకే సామాజిక వర్గానికి అధికారం కట్టబెట్టిందన్నారు. 2024లో జరిగేవి టిడిపికి చివరి ఎన్నికలు అన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు 2019 ఎన్నికల తర్వాత రాయదుర్గంను మరచిపోయారని, ఇప్పుడు కూడా ఎన్నికల సందర్భంగా అంబేద్కర్ వర్ధంతి గుర్తుకు వచ్చిందన్నారు. నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బిసిలు, మైనారిటీలకు ఏం చేశామో వివరాలు ఇస్తాం, టిడిపి హయాంలో ఏం చేశారో చెబుతారా అని కాలవకు సవాల్ చేశారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు జగన్ వెంటే ఉన్నారని, టిడిపి చేసే బూటకపు నాటకాలు, ఆటలు సాగవన్నారు. సమావేశంలో గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ అధ్యక్షులు అరవ శివప్ప, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై వాస్తవాలను బయట పెట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నలంద జూనియర్ కళాశాలలో విద్యార్థిని పాటిల్ సుధ మృతి వెనుక ఉన్న నిజా, నిజాలను బయట పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డి.హీరేహాల్ ప్రాంతానికి చెందిన పాటిల్ సుధ నలంద జూనియర్ కళాశాలలో (సీఈసీ) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ చురుగ్గా ఉండేదన్నారు. అలాంటి విద్యార్థిని ఇంటి నుంచి వచ్చి అదేరోజు హాస్టల్ భవనంలో నాలుగు అంతస్తుకు ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. అయితే సుధా మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని, మృతి వెనుక దాగి ఉన్న రహస్యాలు బయటకు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, సూర్యప్రకాష్, నగర కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, సమీర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి పిడిఎస్‌యు నాయకుల వినతి

విద్యార్థిని సుధ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మానసిక ఒత్తిడి, యాజమాన్యం వేధింపులు, ఆర్థిక సమస్యలు వివిధ కారణాలతో జిల్లాలో విద్యార్థుల మరణాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి నిజాలు బయట పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు బండారు శంకర్, జిల్లా కమిటీ సభ్యులు శివ, నాగార్జున, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

కార్పొరేషన్‌లో..

విగ్రహాల రచ్చ..!



- అనుమతులెవరిచ్చారంటూ కమిషనర్ ఆగ్రహం
- ఉన్నతాధికారి తీరుపై టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అసంతృప్తి
- రెండు రోజుల సెలవులో టిపిఒ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్..?

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంత కార్పొరేషన్‌లో విగ్రహాల రచ్చ కొనసాగుతోంది. విగ్రహాల ఏర్పాటు అధికారల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ వాతావరణం కన్పిస్తోంది. ఈ విషయంపై శనివారం నాడు కార్పొరేషన్‌లో ఉన్నతాధికారి, ఇతర సిబ్బంది మధ్య తీవ్రస్థాయిలో వాదనలు జరిగినట్లు తెలుస్తోంది. 'మీకు తెలియకుండా నగరంలో విగ్రహాలు ఎలా పెడతారు... అనుమతులు ఎవరు ఇచ్చారు.. అనుమతులు లేకుండా విగ్రహాలు పెడుతుంటే మీరేం చేస్తున్నారు.. ఎవరి ఇష్టానుసారం వారు వ్యవహరిస్తుంటే వాటిని కట్టడి చేసి తొలగించాల్సిన బాధ్యత మీపై ఉంది కదా.. ఎందుకు చేయరు.. అన్ని నేనే చెప్పాలా.. వెంటనే విగ్రహాలను తొలగించండి'.. అంటూ అనంత కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై తీవ్ర స్థాయిలో చిందులు తొక్కినట్లు తెలుస్తోంది. విగ్రహాలు ఎవరు ఏర్పాటు చేశారో తమకు తెలియదని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చెప్పినా కమిషనర్ పట్టించుకోలేదు. నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే వీటిని తొలగించే విధంగా తమకు ఆదేశపత్రాలు ఇవ్వాలని సిబ్బంది కోరగా అందుకు కమిషనర్ ససేమిరా అన్నారు. ఈ అంశాన్ని డిసిపి ఎసిపితో మాట్లాడాలని కోరగా అందుకు ఆ అధికారి సమ్మతించనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాలకవర్గ ప్రతినిధులను కలిసి వారి ఇబ్బందులను వెళ్లబోసుకున్నట్లు తెలిసింది.



పాతూరుకు వెళ్లే ఐరన్ బ్రిడ్జి దాటిన తర్వాత పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్గ్ రోడ్డులో రోశయ్య విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. వీటికి సంబంధించి తాను అనుమతులు జారీ చేయకుండా ఎలా ఏర్పాటు చేస్తారని కమిషనర్ కింది స్థాయి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాటిఫికేషన్ పాలకవర్గం చేసినట్లు తెలుస్తోంది. దీనిని కూడా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినందున తొలగింపు చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ దుర్గాంజలిని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు, హోర్డింగ్‌లను తొలగిస్తే పాలకర్గంతో పేచీ, తొలగించకపోతే కమిషనర్‌తో చివాట్లు తింటుండడంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అటుపాలకవర్గం, ఇటు కమిషనర్ ఇద్దరి మధ్యన ఈ శాఖ ఉద్యోగుల విధుల నిర్వహణ కత్తిమీదసాములా తయారైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో టిపిఒ శిరీష, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ దుర్గాంజలి రెండు రోజులు సెలవు పెట్టినట్లు సమాచారం.

ఇటీవల నలుగురు సచివాలయం ప్లానర్స్‌ను బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లుగా నియమిస్తూ అదనపు కమిషనర్ రమణారెడ్డి సంతకాలు చేయడంపై టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. విభాగాధిపతికి తెలియకుండా నేరుగా సచివాలయ సిబ్బందిని బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లుగా ఎలా నియమిస్తారని ఆ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో మేయర్, కమిషనర్ నడుమ పంతాలతో సిబ్బంది నలిగిపోతున్నారు. కమిషనర్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దకుండా దిగువ స్థాయి సిబ్బందిపై తరచూ ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంపైనా ఉద్యోగుల్లో అసహనం వ్యక్తం అవుతోంది. అక్రమాలను ప్రోత్సహించే వారిపై నేరుగా చర్యలు చేపట్టకుండా ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయటం సరికాదని ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తం మీద కార్పొరేషన్‌లో చోటు చేసుకుంటున్న అధిపత్య పోకడలు భవిష్యత్తులో మరిన్ని మలుపులు తీసుకునే అవకాశం ఉన్నట్లు కన్పిస్తోంది.

మేలుచేయడానికే కులగణన



సామాజిక సాధికార బస్సుయాత్రలో పాల్గొన్న మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు

పేదరికం పది శాతం తగ్గింది

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

రాప్తాడులో సామాజిక సాధికార బస్సుయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


రాజ్యాంగ ఫలాలు అందుకోవడానికి దూరంగానున్న అన్ని కులాలకు మేలు చేయడానికే వైసిపి ప్రభుత్వం కుల గణనను చేపట్టిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర సోమవారం నాడు రాప్తాడులో జరిగింది. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి శంకర నారాయణ, పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు న్యాయం చేస్తున్నది వైసిపి మాత్రమేనని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ వర్గాలకు మేలు చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో కులగణను చేపట్టారని వివరించారు. ఇప్పటి వరకు రాజ్యాధికారానికి దూరంగానున్న కులాలకు రాజ్యాధికారం అందివ్వాలన్నదే ఆయన ఉద్దేశమని చెప్పారు. ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గిందన్నారు. వైసిపి అధికారంలోకి రాకముందు 16 శాతం పేదరికముండేదని చెప్పారు. అది ఆరు శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వంటి చోట్ల వలసలు కూడా ఆగిపోయాయని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి జయరాం మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం నవరత్నాలు పెట్టారని చెప్పారు. ఈ పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. కుటుంబానికి మేలు జరగకుంటే తనకు ఓటు కూడా వేయవద్దని చెప్పే ధైర్యం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఉందన్నారు. చంద్రబాబునాయుడు అంతా కుట్రలు, కుతంత్రాలేనని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే అది తన ఘనతేనన్నట్టుగా చెప్పుకునే విధంగానున్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ మోసపూరిత హామీలను నమ్మొద్దని విమర్శించారు. బాపట్ల ఎంపీ నందిగామ సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వెన్నుపోటుదారుడున్నారు. మామ ఎన్టీఆర్‌కే వెన్నుపొడిచారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్‌కు వెన్నుపోటు తప్పదని హెచ్చరించారు. వారి మోసపూరిత మాటలు నమ్మొద్దని హెచ్చరించారు. ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు మొదలుకుని అన్ని రాజకీయ పదవుల్లో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు సమ ప్రాధాన్యతను వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. ఆయనతోనే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

కలెక్టర్‌కు మున్సిపల్ ఉద్యోగుల సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో డిఆర్ఓ గాయత్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థలో పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు 800 మందికి పైబడి పని చేస్తున్నారని తెలిపారు. కార్మికులందరూ అనంతపురం రూరల్ ఉప్పరపల్లి పంచాయతీలో గుట్టను సదును చేస్తూ ముళ్లపొదలను కంపచెట్లను శుభ్రం చేశారని తెలిపారు. కావున ఆ భూమిని మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్ల సలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు గురురాజా, ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ కార్మికుల యూనియన్ కోశాధికారి భర్తల ఆదినారాయణ, ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంజీవ రాయుడు, మల్లికార్జున, నగర ప్రధాన కార్యదర్శి ఓబుళపతి, పోతులయ్య, పారిశుధ్య విభాగం నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు స్వామి, సాకే తిరుమలేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, ఆదినారాయణ, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో సమస్యలను వివరిస్తున్న కార్మికుల యూనియన్ నాయకులు

రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మలాకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులతోపాటు వాస్తవంగా సాగులో ఉన్న కౌలు రైతులకు కూడా పరిహారం చెల్లించాలన్నారు. రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, ఉపాధి హామీ కింద 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం అంచనాల కోసం తీసుకొచ్చిన జీవో.5ను ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ జీవో ప్రకారం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సమయంలో 33శాతంపైగా పంట నష్టం జరిగి ఉండాలన్నారు. అదికూడా గరిష్టంగా రెండు హెక్టార్లకు మాత్రమే పరిహార ఇవ్వాలనే నిబంధన ఉందన్నారు. అలాకాకుండా నష్టపోయిన ప్రతి పంటకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇవ్వాలని, పంట సాగు చేసిన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు, సాగు చేయని రైతులకు రూ.30వేలు ఇవ్వాలన్నారు. అలాగే పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుంకన్న, ఎర్రిస్వామి, ఆంజనేయులు, జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



డ్రైయినేజీ నీరు చేరడంతో బురదమయమైన రహదారి

రోడ్డు ఇలా.. నడిచేదెలా..?

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో రోడ్లు బురదమయమై ఉన్నాయని, రాకపోకలు సాగించడమెలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో వెంటనే డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామానికి చెందిన రైతు బోయ పోతప్ప మాట్లాడుతూ గ్రామంలోని జుమ్మా మసీదు నుంచి ఎర్రగుంట ఎల్లప్ప ఇంటి వరకూ డ్రెయినేజీ నీరు సీసీ రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం పడకేయడం, ఎక్కడికక్కడ చెత్తచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నా ప్రజాప్రతినిధులు కానీ పంచాయతీ కార్యదర్శులు కానీ పట్టించుకోవడం లేదన్నారు.



చిత్రాన్నం తింటున్న అంగన్వాడీ సెంటర్‌లోని పిల్లలు

అంగన్వాడీ సెంటర్లలో అందని పౌష్టికాహారం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని సెంటర్లలో అంగన్వాడీ టీచర్లు పిల్లలకు కేవలం చిత్రాన్నం, పలావ్ పెడుతున్నట్లు సమాచారం. ప్రతి సెంటర్‌కూ నెల నెలా కోడిగుడ్లు, కందిబేళ్లు, బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా గత నెల నుంచి కందిబేడలు అందకపోవడంతో పిల్లలకు చిత్రాన్నం మాత్రమే పెడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అన్ని అంగన్వాడీ సెంటర్లకు కందిబేళ్లు సరఫరా చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ వైర్లు తొలగించాలి

ఉరవకొండ : పట్టణంలోని 4వ సచివాలయం పరిధి ఉన్న పాతపేటలో చాలా కిందగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించాలని కాలనీవాసి, ఉరవకొండ పిఎసిఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ఒకసారి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి విన్నవించామన్నారు. అయినా తొలగించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రాణనష్ట సంభవించకనే విద్యుత్ వైర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని మండలంలోని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఒ శ్రీదేవి, సర్పంచి వరలక్ష్మి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐకు వేర్వేరుగా అంగన్‌వాడీలు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు వంటి సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు విజ్ఞప్తి చేశామన్నారు. అయినా స్పందించకపోవడంతో ఈనెల 8వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే సమ్మెకు సంబంధించిన నోటీసులు ఉన్నతాధికారులకు సమర్పించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు



కళ్యాణదుర్గంలో పోలీసు అధికారికి వినతిప్రతం అందజేస్తున్న అంగన్వాడీలు

అధికారులకు సమ్మె నోటీసు అందజేత

ప్రమోషన్లు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లు నిబంధనలు రూపొందించాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు నాగరాణి, భాగ్యలక్ష్మి, అరుణ, పెద్దక్క, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డికి అంగన్‌వాడీలు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కమిటీ మండల అధ్యక్షురాలు జయలలిత, రమాదేవి, శివపార్వతి, శశికళ, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పామిడి మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్‌పీరాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

రాయదుర్గం : ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం అధికారులకు అందజేశారు. సిఐటియు నాయకులు బి.మల్లికార్జునతో కలిసి డిప్యూటీ తహశీల్దార్, ఎంపిడిఒలకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, శోభారాణి, నాగమణి, విజిత, రోజా, రామసుబ్బమ్మ, అంగన్వాడీ వర్కర్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ,



పెద్దవడుగూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

సిఐటియు నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాళ్ : అంగన్వాడీ సిబ్బంది పలు సమస్యలపై డిసెంబర్ 8వ తేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె నోటీసులను సోమవారం ఎంపిడిఒ భాస్కర్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ జనవర్ధనరెడ్డి, ఎస్‌ఐలకు అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సిఐటియు, ఎఐటియుసి, ఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ యూనియన్లు డిసెంబర్ 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, సిపిఎం మండల కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సంబంధించి అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆర్సిడి ప్రసాద్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో అధికారులు, నాయకులకు నోటీసులు అందజేశారు. వారు మాట్లాడుతూ వేతనాల పెంపు, గ్రాట్యుటీ, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్, తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్డిఒ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ సురేష్, సిఐ హరినాథ్‌లకు సమ్మె నోటీసు అందజేశారు. సమ్మెకు ప్రజాసంఘాల నాయకులు, మేధావులు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో పాతక్క, పద్మక్క, తులసి, విద్యార్థి సంఘం నాయకులు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

రాయదుర్గం : చెట్టుకొమ్మను నరికే ప్రయత్నంలో చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం రాయదుర్గంలో చోటుచేసుకుంది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సునీల్(36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. వాల్మీకి నగర్ ప్రాంతంలో ఉదయం ఓ చెట్టు ఎక్కి కొమ్మను నరుకుతుండగా పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. సునీల్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయదుర్గం పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉత్తరప్రదేశ్‌కి చెందిన మిథిలేష్ కాష్యాప్ (45) రైల్వేస్టేషన్‌లోని 2వ ఫ్లాట్‌ఫారంపై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పామిడి

ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటరు జాబితా పరిశీలన, చేర్పులు, మార్పులపై టిడిపి నాయకులు అప్రమత్తంగా ఉండాలని పామిడి 11వ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎంహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు రెండు రోజులపాటు ఓటరు వెరిఫికేషన్ చేపట్టారన్నారు. ఈ సందర్భంగా తాము ఫిర్యాదు చేసిన ఓటర్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించగా తొలగించేది తమ పరిధిలో లేదని బిఎల్ఓ సమాధానం ఇచ్చారన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత లక్ష్మీనారాయణరెడ్డి

ఇప్పటికైనా ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించడంతోపాటు దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జింకల రామకృష్ణ, గౌస్‌పీరా, జిలాన్, కుమార్, మహమ్మద్ రఫీ, మాలిక్ బాషా, వెల్డింగ్ బాబా, కొండాపురం రఫీ, జాఫర్, బాబు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల అభివృద్ధే ధ్యేయం : ఎంపిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

వికలాంగులను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వికలాంగుల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సహకారంతో మయూరి వికలాంగుల సంఘం భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం ఇప్పించడంతోపాటు భవన నిర్మాణం చేసుకోవడానికి ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అర్హతను బట్టి ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామన్నారు. భవిష్యత్తులో కూడా వికలాంగులకు చేతనైన సహాయం చేయడానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, విద్యా కమిటీ చైర్మన్ గిరిబాబు, ఎపిఎం రామ్మోహన్, ఎంపిటిసి ఓబులేసు, తిమ్మరాజు, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, నాయకులు మహేష్, హనుమంతు, ఆర్డీటీ సిబ్బంది, మయూరి వికలాంగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కరణం పుష్పావతి

అమరావతి ఆసుపత్రిపై చర్యలు

గైనిక్ ఓపీ, కాన్పుల విభాగం మూసివేత

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని అమరావతి ఆసుపత్రిలో గైనిక్ ఓపీ, కాన్పుల విభాగాన్ని జిల్లా వైద్యాధికారులు సోమవారం మూసివేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గత అక్టోబర్ మాసంలో గార్లదిన్నె మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర తన భార్యా మహాలక్ష్మిని కాన్పుకోసం అమరావతి ఆసుపత్రిలో చేర్పించారు. ఒక రోజు తర్వాత కాన్పు సమస్యలతో తల్లీ, శిశువు మరణించారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తల్లి, శిశువు మరణించారని బాధితుడు నాగేంద్ర డిఎంఅండ్‌హెచ్ఒకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అమరావతి ఆసుపత్రిలో రెగ్యులర్ గైనకాలజీ వైద్యుడు లేనందువల్ల సరైన సమయానికి వైద్యం అందించలేక గర్భిణి మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా॥ఈబి.దేవి ఆదేశాల మేరకు అమరావతి ఆసుపత్రిలోని గైనిక్ విభాగాన్ని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డెమో ఉమాపతి,ఉప డెమో త్యాగరాజు పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

శింగనమల : మండల కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, ఆర్డీటీ ఎస్‌టిఎల్ ఇంద్రమ్మ, ప్రసన్న, ఎస్‌టిఎల్లో సావిత్రి, మండల ఆర్డీటీ జీవో రామలక్ష్మి, ముత్యాలప్ప, నారాయణస్వామి, నారాయణ, ఆదినారాయణ, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమను ఆదుకోవాలి


ప్రజాశక్తి-రాయదుర్గం

కరువు పరిస్థితులతో పూర్తిగా చితికిపోయిన రాయలసీమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోకపోతే డిసెంబర్ 10వ తేదీ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎపిలో 432 మండలాల్లో తీవ్ర కరువు నెలకొనగా కేవలం 130 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించినా సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. సీమను ఆదుకునేందుకు హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ కాలువకు సమాంతర కాలువ, ఓర్వకల్లు, బిటిపి ఎత్తిపోతల పథకాలు, కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. కర్నాటకలో అప్పర భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రత్యేక ప్యాకేజీ, రైతులకు నష్టపరిహారం అందజేయాలని, బ్యాంకు రుణమాఫీ చేయాలని, ప్రత్యామ్నాయ పంట సాగుకు విత్తనాలు, సబ్సిడీపై ఎరువులు, పశువులకు గ్రాసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు రద్దు చేయాలన్నారు. ఆయనతో పాటు తాలూకా కార్యదర్శి ఎస్‌వి అంజనేయు లు, కార్యదర్శి అక్బర్, రైతు సంఘం నాయకులు ప్రతాపరెడ్డి, కార్యవర్గ సభ్యులు మక్బూల్‌బాషా, రాయలసీమ మహిళా సంఘం కార్యవర్గ సభ్యురాలు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల రిలేనిరాహార దీక్ష

ప్రజాశక్తి-రాయదుర్గం


ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సిఎం జగన్ వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సంఘీభావం ప్రకటించారు. కాలవ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని విమర్శించారు. తక్కువ మొత్తం డిపాజిట్‌దారులను ఆదుకోవడం కోసం టిడిపి పాలనలో రూ. 250 కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. ఆవేదనతో ఆత్మహత్య చేసుకొన్న బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని, లేనిచో సామాజిక సాధికార యాత్రను అడ్డుకుంటామని సిపిఐ పట్టణ కార్యదర్శి కోటేష్, తాలూకా కార్యదర్శి నాగార్జున, సిపిఎం తాలూకా కార్యదర్శి మల్లికార్జున, అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి హెచ్చరించారు. దీక్షలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, సిపిఐ తాలూకా సహాయక కార్యదర్శి గురుస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, సిపిఐ నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, నాగరాజు, దుర్గన్న, తదితరులు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు

'ఘంటసాల'కు నివాళి

గుత్తి : పద్మశ్రీ అవార్డు గ్రహీత ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని బాలసుబ్రమణ్యం, కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వార్డెన్ మల్లికార్జునరావు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జ్ఞాన శేఖరన్, నాయకులు ఒ.ఎం.కె.ప్రసాద్, విజయ్‌భాస్కర్, కందుల హేమ తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కల్చరల్ అసోసియేషన్ నాయకులు

ఎండియు ఆపరేటర్‌పై ఫిర్యాదు

ఉరవకొండ : మండల పరిధిలోని పల్లి గ్రామానికి సంబంధించిన చౌకధాన్యం సరఫరా చేసే ఎండియు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచి బోయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల వద్దకే పాలన అందించాలని ఉద్దేశంలో భాగంగా ప్రత్యేక వాహనాలను సమకూర్చి ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేస్తోందన్నారు. అయితే పల్లి గ్రామానికి చెందిన ఎండియు ఆపరేటర్ సక్రమంగా పంపిణీ చేయడం లేదన్నారు. ఈ విషయమై తహశీల్దార్‌తోపాటు సిఎస్‌డిటికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎండియు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టౌన్‌బ్యాంకు అక్రమాలపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని టౌన్‌బ్యాంకులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరరు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1936లో టౌన్‌బ్యాంకు ప్రారంభమైనప్పటి నుంచి చిన్నచిన్న వ్యాపారులకు రుణాలు ఇవ్వడంతో పాటు బంగారంపై రుణాలు ఇస్తూ ఖాతాదారుల నుంచి డిపాజిట్లు సేకరించి మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. అయితే బ్యాంకు పాలకవర్గాల అనాలోచిత విధానాల వల్ల ఇష్టానుసారంగా రుణాలు ఇస్తూ రికవరీ చేయడంలో నిర్లక్ష్యం కారణంగా బ్యాంకు దివాలాస్థితికి వచ్చిందన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరి నుంచి వసూలు చేయాలని కోరారు. ఇకపోతే ఉరవకొండ మేజర్ పంచాయతీ స్థలాలు అన్యక్రాంతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. పంచాయతీ స్థలాలను చేనేత క్లస్టర్ పేర్లతో ప్రభుత్వం నుంచి తీసుకుని వారి సొంత వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. చేనేత క్లస్టర్ల పేర్లతో అక్రమాలకు పాల్పడుతు స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.



తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

'ఆడుదాం ఆంధ్ర'ను సద్వినియోగం చేసుకోండి

పామిడి : సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి కాయల మహేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 15ఏళ్లు నిండిన యువతీ, యువకులు సమీపంలోని సచివాలయాల్లో తమపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

టిప్పుసుల్తాన్ విగ్రహ ఏర్పాటు ఆగదు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో ఏర్పాటు చేయనున్న టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఎవరు అడ్డుకున్నా ఆపేది లేదని బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నేతలు అన్నారు. సోమవారం ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రంలో వారు మాట్లాడుతూ సమాజానికి ఎంతో సేవ చేసిన టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బిజెపి నేతలు వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందన్నారు. విగ్రహాలపై మత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎవరూ అడ్డుకున్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఐఎంఎం మహబూబ్‌బాషా, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముస్కిన్, ఎస్సీ, ఎస్టీ జెఎసి చైర్మన్ సాకే హరి, ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసగాని కుళ్లాయప్ప, ఎస్టీ సంఘం నాయకురాలు ఉమా మహేశ్వరి, టిడిపి మైనార్టీ సెల్ నాయకులు ఫిరోజ్, టిప్పు సుల్తాన్ ట్రస్టు సభ్యులు నజీర్, జనబలం జాకీర్, ఐఎంఎం దాదూ, నిజాం, రమణ, డాక్టర్ కుళ్లాయప్ప, నరేష్, చాందు, చిరు సాదిక్, సౌకత్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం యల్లనూరు మండలం తిరుమలపురం గ్రామంలో 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని విమర్శించారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాట పట్టాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, జెఆర్‌పేట.బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసి ప్రభాకర్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

శింగనమల : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆపార్టీ తెలుగు యువత మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు మినీ మేనిఫెస్టోను ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. దీంతో టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో టిడిపి మేనిఫెస్టోను 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ప్రజల్లో తీసుకెళుతున్నామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

పుట్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కులగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి ప్రకటనలో తెలిపారు.

కళ్యాణదుర్గం : పట్టణ పరిధిలోని వివిధ కులాల వివరాల సేకరణ కోసం చేపట్టనున్న 'కులగణన'పై మంగళవారం(నేడు) రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, మేధావులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

సిఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉరవకొండ : సిఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు భవిష్యత్తులో కూడా మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరగాలంటే తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాటిల్ అన్నపూర్ణమ్మ, ఇఒఆర్డి సత్యబాబు, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ మునాఫ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, స్కూల్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఉండబండ మాజీ సర్పంచి ఓబులప్ప, ఎంపిటిసి ఓబులేష్, సచివాలయ కన్వీనర్ చిదానంద, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

యువతను నిర్లక్ష్యం చేస్తే కెసిఆర్ గతే..

అనంతపురం : సిఎం జగన్ యువతను నిర్లక్ష్యం చేసి మోసం చేస్తే తెలంగాణలో కెసిఆర్‌కు పట్టిన గతే పడుతుందని యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్, వెల్ఫేర్‌ఆ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ గైబువలి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చి ఒక్క జాబ్ క్యాలండర్‌ను విడుదల చేసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్లి జీవనం గడుపుతున్నారు. భవిష్యత్తులో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ యువతను నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు ఇంటికి పంపారని గుర్తు చేశారు. కావున ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో అధికారం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కుందుర్పి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ లక్ష్మినరసింహ పేర్కొన్నారు. కుందుర్పిలో సోమవారం సర్పంచి గౌని ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో సిఎం జగన్ నవరత్నాల హామీలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, కో ఆప్షన్ మెంబర్ ముజువుల్లా, సచివాలయ మండల కన్వీనర్ ఇ.రాము, ఎంపిటిసి నరసింహారెడ్డి, వైసిపి నాయకులు బాబు, గోపాల్, మల్లయ్య, గృహ సారథులు మధు, రాజు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

గార్లదిన్నె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి సమస్య ఉన్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దిలీప్‌కుమార్ కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న, ఎపి మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సతీష్, అరుణకుమారి, సావిత్రి, మౌలిక, తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యులు

రైతులు, కూలీలను ఆదుకోవాలి

శింగనమల : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తరిమెల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కూలీలు లక్ష్మీరంగయ్య, స్వరనాగప్ప, శ్రీనివాసులు, రవిశంకర్, రామదాసు శ్రీనివాసులు, మాజీ సర్పంచులు ఆదినారాయణ, శంకర్, ఆదినారాయణ, నాగరాజు, ఇరువెందుల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కల్వరి గ్రాండ్‌లో క్రిస్మస్ వేడుకలు

అనంతపురం : అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో క్రిస్మిస్ వేడుకలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వరి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ పి.సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు, కల్వరి మినిస్ట్రీస్ రాయలసీమ కోఆర్డినేటర్ సుమన్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి కాంతి జాన్‌వెస్లీ, ఎఐసిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఫీబా జయరాజ్ పాల్గొన్నరు.

గుత్తి ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

అనంతపురం : ప్రాంతీయ నిఘా, అమలు అధికారి మునిరామయ్య ఆదేశాల మేరకు గుత్తి ఎంఎల్ఎస్ పాయింట్‌ని విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భౌతిక నిలువలు, పుస్తక నిలువలను పరిశీలించగా 9.57 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నాయన్నారు. అలాగే పామాయిల్ ఎక్కువ ఉండడం గుర్తించారు. తదుపరి చర్యల నిమిత్తం ఆయా వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అధికారులు పి.శేషగిరి, ఎల్.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు